క్లుప్తంగా

తునికాకు కల్లాలు పరిశీలన



కల్లాన్ని పరిశీలిస్తున్న ఎఫ్ఆర్వో

దహెగాం: మండలంలోని గిరవెల్లి యూనిట్ పరిధిలో గల తునికాకు కల్లాలను బుధవారం ఎఫ్ఆర్వో అప్పలకొండ పరిశీలించారు. యూనిట్ పరిధిలోని గిరవెల్లి, ఈటపల్లి, గెర్రె, చంద్రపల్లి, రావులపల్లి గ్రామాల్లోని కల్లాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కల్లాలకు నాణ్యమైన తునికాకు తీసుకురావాలని కూలీలకు సూచించారు. ఆయన వెంట ఎఫ్బీవోలు సద్దాం, మధుకర్, ఆస్మా తదితరులు ఉన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

కెరమెరి: మండలంలోని సాంగ్వి గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ పెందోర్ మోతిరాం ప్రారంభించారు. బంగారు తెలంగాణ లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దృష్టి లోపం ఉన్న వారు కంటి పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో సుదర్శన్, సర్పంచ్ తొడోసం జగన్నాథ్‌రావు, ఎంపీటీసీ సకారాం ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సనత్‌కుమార్

దహెగాం: మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన తలాండి రమేశ్ వారం క్రితం తన స్మార్ట్‌ఫోన్ పోగొట్టుకోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో నూతన వెబ్‌సైట్ సీఈఐఆర్ ఆధారంగా పోగొట్టుకున్న ఫోన్‌ను గుర్తించి బుధవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు.

రేపు కెరీర్ గైడెన్స్‌పై ఫోన్‌ఇన్

కాగజ్‌నగర్‌టౌన్: ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత విద్యాకోర్సులకు సంబంధించి సూచనలు, సలహాలు ఇవ్వడానికి కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఫోన్‌ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మినరసింహం తెలిపారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 7013607011నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో గ్రూపునకు 40సీట్ల చొప్పున మొత్తం 160 సీట్లు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. పదో తరగతిలో సాధించిన మెరిట్ ఆధారంగా రోస్టర్ ప్రకారం ఎంపిక ఉంటుందన్నారు. పది పాసైన విద్యార్థులు ఈనెల 25వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'మన ఊరు మన బడి'తో మెరుగైన సౌకర్యాలు

రెబ్బెన: మన ఊరు –మన బడి కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఎంఈవో వెంకటేశ్వరస్వామి అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో కొనసాగుతున్న పనులను బుధవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలు తిరిగి ప్రారంభించేలోగా పనులు పూర్తి చేయాలన్నారు. హెచ్ఎం మేడి చరణ్‌దాస్‌కు సూచించారు. ఎస్ఎంసీ చైర్మన్ అర్కెల స్వామి, ఉపాధ్యాయులు అనీస్ అహ్మద్, జమునాదాస్ పాల్గొన్నారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న క్రిష్ణమాచారి

చింతలమానెపల్లి: వీవోల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. బుధవారం వీవోఏల నిరసన 31రోజులకు చేరుకున్న సందర్భంగా ఐకేపీ కార్యాలయం ఎదుట ఎండలో కూర్చుని నిరసన తెలిపారు. మండల వీవోఏల సంఘం అధ్యక్షుడు తొరె నారాయణ, గౌరవ అధ్యక్షుడు కొండు స్వప్న, నాయకులు మధుకర్, దుర్గం ఏమాజీ, నక్క మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అటవీశాఖ అనుమతులు లేక పనులు నిలిచిపోయిన కల్వాడ - కుంచవెల్లి రోడ్డు

- అనుమతులు లేక నిలిచిపోయిన పనులు
- రెన్యూవల్ బీటీని అడ్డుకుంటున్న వైనం
- ఆరు కిలోమీటర్ల రోడ్డుకు రూ.4.51 కోట్లు మంజూరు

రోడ్డు నిర్మాణానికి అటవీ అడ్డు

దహెగాం: గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రోడ్లు నిర్మించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేస్తుండగా కొన్నిచోట్ల అటవీశాఖ అనుమతులు ఇవ్వకుండా అడ్డుకుంటోంది. మండలంలోని కల్వాడ నుంచి పీకలగుండం గ్రామం వరకు ఉన్న రోడ్డు గుంతలుగా మారడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రెన్యూవల్ బీటీ వేయడానికి నిధులు మంజూరు చేసింది. దీంతో ఉన్న బీటీని తొలగించి కొత్తగా బీటీ వేయనున్నారు. కొత్త రోడ్డు నిర్మాణం కాకపోయినా అటవీశాఖ అడ్డుకోవడం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆరు కిలోమీటర్లకు రూ. 4.51కోట్లు..

మండలంలోని కల్వాడ నుంచి పీకలగుండం గ్రామం వరకు 6 కిలోమీటర్ల మేర రెన్యూవల్ బీటీ వేసేందుకు ఆర్అండ్‌బీ శాఖ రూ.4.51 కోట్లు మంజూరు చేసింది. బీటీ నిర్మాణ పనులు సైతం వేగంగానే కొనసాగుతున్నాయి. అయితే కల్వాడ నుంచి కుంచవెల్లి వరకు 2.5 కిలోమీటర్లు అటవీశాఖ అనుమతులు లేవంటూ పనులు నిలిపివేశారు. కుంచవెల్లి నుంచి పీకలగుండం వరకు మాత్రమే పనులు చేస్తున్నారు. ఇదే రోడ్డు మార్గంలో రెండు వంతెనల నిర్మాణానికి రూ. 4.39 కోట్లు మంజూరు కాగా పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. రోడ్డు కంకర వేసి చదను చేయడం, క్యూరింగ్ వంటి పనులు చేస్తున్నారు.

అడవి లేకున్నా..

కల్వాడ నుంచి కుంచవెల్లి వరకు అటవీ ప్రాంతం లేదు. అయినా అనుమతుల పేరిట పనులు అడ్డుకుంటున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అటవీ ప్రాంతం కాకపోవడం వల్ల రోడ్డుకిరువైపులా ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. వన్యప్రాణులు సంచరించే ప్రదేశం కూడా కాదని, అయినా రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అడ్డు చెప్పడం ఏంటని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు.

తీర్మానాలు అటవీశాఖకు అందజేత..

కల్వాడ, కుంచవెల్లి గ్రామ పంచాయతీల్లో బీటీ రోడ్డు నిర్మాణానికి తీర్మానాలు చేసి అటవీశాఖకు అందజేయాలని ఉన్నతాధికారుల సూచన మేరకు ఆయా గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు సైతం చేశారు. తీర్మానాలను అటవీ శాఖ అధికారులకు అందించారు. అయినా అనుమతులు ఇవ్వడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

అనుమతులు లేక పనుల నిలిపివేత



కల్వాడ నుంచి పీకలగుండం గ్రామం వరకు రెన్యూవల్ బీటీ వేసేందుకు నిధులు మంజూరయ్యాయి. కల్వాడ నుంచి కుంచవెల్లి వరకు అటవీశాఖ అనుమతులు లేవని పనులు కొనసాగనివ్వడం లేదు. కుంచవెల్లి నుంచి పీకలగుండం వరకు పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. అటవీశాఖ వెంటనే అనుమతులు ఇవ్వాలి.– **హట్కర్ మధుకర్, కల్వాడ**

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



కల్వాడ నుంచి పీకలగుండం వరకు రెన్యూవల్ బీటీ నిర్మాణానికి రూ.4.51 కోట్లు మంజూరయ్యాయి. కొత్తగా అడవిలో నుంచి రోడ్డు వేయకపోయినా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం సమంజసం కాదు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. కల్వాడ, కుంచవెల్లి జీపీల తీర్మానాలను అధికారులకు అందించాం.

– **తాళ్లపల్లి రామారావు, జెడ్పీటీసీ**

అనుమతుల కోసం విన్నవించాం

కల్వాడ నుంచి కుంచవెల్లి వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి అటవీశాఖ అనుమతుల కోసం సంబంధిత అధికారులకు లెటర్ పెట్టాం. అనుమతులు రాగానే పనులు చేపడుతాం. ప్రస్తుతం కుంచవెల్లి నుంచి పీకలగుండం వరకు రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.

– **లక్ష్మినారాయణ, ఆర్అండ్‌బీ డీఈ**

నర్సరీ మొక్కలపై 'ఎండదెబ్బ'

- అధిక ఉష్ణోగ్రతలతో ముప్పు
- వేడికి వాడిపోతున్న మొక్కలు
- కాపాడేందుకు సిబ్బంది పడరాని పాట్లు



రాంపూర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో సురేందర్ (ఫైల్)

రెబ్బెన: హరితహారం కోసం గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీల్లో మొక్కలు సిద్ధమవుతున్నాయి. రెండు నెలల క్రితం ప్రారంభమైన మొక్కల పెంపకంపై ప్రస్తుతం ఎండలు తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. కొన్ని రోజులుగా మండలంలో రికార్డు స్థాయిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల తీవ్రత నుంచి నర్సరీల్లోని మొక్కలను కాపాడేందుకు పంచాయతీ సిబ్బంది పడరాని పాట్లు పడుతున్నారు. రోజుకు రెండు పూటలు నీళ్లు పడుతున్నా వడగాలుల మూలంగా మొక్కల బెడ్లు గంటలోనే తడారిపోతున్నాయి. ఏర్పాటు చేసిన గ్రీన్‌షెడ్ నెట్స్ సైతం ఎండల తీవ్రతను ఆపలేకపోతున్నాయి. దీంతో కొన్ని మొక్కలు వాడిపోతుండగా, మొలక దశలోని మొక్కలు వేడికి తట్టుకోలేక చనిపోతున్నాయి.

మొక్కలను కాపాడేందుకు అపసోపాలు

మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 24 నర్సరీలు ఉన్నాయి. రెండు నెలల క్రితం నర్సరీల్లో మొక్కల పెంపకం పనులు ప్రారంభం కాగా ప్రస్తుతం మొక్కలన్ని ఏపుగా పెరుగుతున్నాయి. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బెడ్స్‌లలో మొక్కలు పెంచుతుండగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో మొక్కలకు నీళ్లు పడుతూ సిబ్బంది కంటికి రెప్పలా కాపాడుతున్నారు. అయితే మండలంలో నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలు నర్సరీల్లోని మొక్కలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఎండల తీవ్రత నుంచి మొక్కలను కాపాడేందుకు అన్ని నర్సరీల్లో గ్రీన్‌షెడ్ నెట్స్‌ను ఏర్పాటు చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది. చనిపోయిన మొక్కల స్థానంలో ఇతర మొక్కలు పెంచేందుకు ప్రైమరీ బెడ్స్‌లో పెంచుతున్న చిన్న మొక్కలతో పాటు బెడ్స్‌లోని మొక్కలు ఎండల ధాటికి తట్టుకోలేక చనిపోతున్నాయి.

పెరుగుతున్న పనిభారం

వానాకాలం హరితహారంలో నాటేందుకు మొక్కలను అన్ని పంచాయతీల్లోని నర్సరీల్లో పెంచుతున్న నేపథ్యంలో ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు నర్సరీల్లో పని కల్పిస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న ఎండల తీవ్రతతో గతంలో కంటే ఎక్కువ సార్లు మొక్కలకు నీటిని అందించాల్సి వస్తోంది. అధిక ఉష్ణోగ్రతలు, వడగాలుల కారణంగా నీళ్లు అందించిన కొద్ది గంటల్లోనే బెడ్స్ తడారిపోతున్నాయి. దీనికి తోడు చాలా నర్సరీల్లో అందుబాటులో నీటి సౌకర్యం లేకపోవటంతో పంచాయతీ ట్యాంకర్ల ద్వారా మొక్కలకు నీళ్లు పడుతున్నారు. ట్యాంకర్లతో తీసుకొచ్చిన నీళ్లు సైతం ఎండలకు వేడెక్కుతున్నాయి. వాటిని మొక్కలకు అందించలేక నీళ్లు పట్టాల్సిన ప్రతీసారి ట్యాంకర్లను సైతం మళ్లీ నింపాల్సి వస్తోంది. మొక్కలకు ఎక్కువసార్లు నీళ్లు అందించటం, మాటిమాటికీ ట్యాంకర్లను నీళ్లతో నింపాల్సి వస్తుండటంతో పంచాయతీ సిబ్బంది, ఉపాధిహామీ కూలీలపై తీవ్ర పనిభారం పడుతోంది.

మొక్కలను కాపాడేందుకు చర్యలు



నర్సరీల్లో పెరుగుతున్న మొక్కలను ఎండల తీవ్రత నుంచి కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. మొక్కలకు ఎప్పటికప్పుడు నీరు అందిస్తూ బెడ్లలో తడారిపోకుండా చూస్తున్నాం. అన్ని నర్సరీల్లో గ్రీన్‌షెడ్ నెట్స్‌ను ఏర్పాటు చేశాం. అయినా కొన్ని రోజులుగా నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతలతో మొక్కలు వాలిపోతున్నాయి. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను ఏర్పాటు చేస్తున్నాం.

– **శ్రీనివాస్, ఎంపీడీవో**

క్రీడల్లో గెలుపోటములు సహజం



కాగజ్‌నగర్‌రూరల్: గెలుపొందిన క్రీడాకారులతో ఎంపీపీ శంకర్, అధికారులు

బెజ్జూర్: క్రీడల్లో గెలుపోటములు సహజమని ఎంపీడీవో మాధవీలత, ఎంపీవో రమేశ్ రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు సిడాం సకారాం అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్‌లో మొదటి బహుమతి కుంటల మానెపల్లి, రన్నరప్‌గా గెర్రెగుడా జట్లు నిలిచాయి. 1600 మీటర్ల రన్నింగ్‌లో విఙ్ణేష్ (గెర్రెగూడ), లాంగ్ జంప్‌లో తేజకిరణ్ (ముంజంపల్లి), అథ్లెటిక్స్‌లో రవితేజ (లుంబినగర్)లు జిల్లాస్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ డోకే వెంకన్న, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఇంజిరి రాజారాం, అజీమ్‌ఖాన్, ఏనుక శ్రీహరి, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సోహెల్, గట్టయ్య, క్రీడాకారులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: సీఎం కప్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయ క్రీడామైదానంలో మూడు రోజులుగా కొనసాగుతున్న క్రీడాపోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంపీడీవో గౌరీశంకర్‌లు ప్రశంసా పత్రాలు అందజేశారు. కబడ్డీలో అందవెల్లి, వాలీబాల్‌లో ఆరెగూడ, ఫుట్‌బాల్‌లో కాగజ్‌నగర్ జట్లు గెలుపొందాయి. 100 మీటర్ల పరుగు పందెంలో ఎండీ సమీరుద్దీన్, 400 మీటర్ల పందెంలో నవీన్, 100 మీటర్ల ఉమెన్ విభాగంలో కౌసర్‌బాను, 400 మీటర్ల ఉమెన్ విభాగంలో కౌర్‌బానులు గెలుపొందారు. పీడీ నాగేశ్వర్‌రావు, పీఈటీలు జోసెఫ్, శారద, ఏడుకొండలు, కృష్ణప్రసాద్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న సీఎంకప్ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎంపీడీవో మహేందర్, ఎస్సై విజయ్, ఎంపీవో సుధాకర్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు నాజిం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని క్రీడా మైదానంలో ఈ నెల 15న ప్రారంభమైన సీఎం కప్ క్రీడలు బుధవారం ముగిశాయి. 100 మీటర్ల రన్నింగ్‌లో అనార్‌పల్లికి చెందిన నారాయణ, సుశీల్, 400 మీటర్ల రన్నింగ్‌లో నాగోసే భాస్కర్, మామ్మె ప్రకాశ్‌లు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. వాలీబాల్‌లో అనార్‌పల్లి, మోడి జట్లు, ఖోఖోలో సాకడ, కెరమెరి జట్లు, కబడ్డీలో నిషాని, కెరమెరి జట్లు గెలుపొందాయి. విజేతలకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, ఎస్సై వెంకటేశ్, ఎంపీటీసీ ఇఫ్తేకార్, సర్పంచ్ జగన్నాథ్, బైనాబాయి, టీఆర్ఎస్ నాయకులు ఉత్తం, యూనూస్ ఉన్నారు.

వాంకిడి: గ్రామీణ క్రీడాకారుల నైపుణ్యం గుర్తించేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ముండే విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌లు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన 52 మంది క్రీడాకారులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ రహీముద్దిన్, ఇన్‌చార్జి ఎంపీడీవో శివకుమార్, సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్, సర్పంచ్ అయూబ్, దీపక్ ఉన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలో మూడు రోజులుగా కొనసాగుతున్న సీఎం కప్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. తహసీల్దార్ సరిత, ఎంపీడీవో గంగాసింగ్, ఎస్సై విజయ్, సర్పంచ్ చంద్రమౌళి, ఎంపీటీసీ రాజన్న, పీఈటీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెన: ప్రతీ క్రీడాకారుడు తమకు నచ్చిన క్రీడలో నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటూ పోటీల్లో రాణించేందుకు కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్ అన్నారు. సీఎం కప్ పోటీల్లో భాగంగా గోలేటి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన మండలస్థాయి క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో వెంకటేశ్వరస్వామి, ఎంపీవో అంజద్‌పాషా, సర్పంచ్ పోటు సుమలత, ఎస్సై భూమేశ్, పీఈటీ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి జలేందర్ పాల్గొన్నారు.



బెజ్జూర్: బహుమతులు అందజేస్తున్న నాయకులు



కెరమెరి: ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ



చింతలమానెపల్లిలో..

పేద విద్యార్థికి ఎమ్మెల్యే భరోసా



కోనప్పకు వినతిపత్రం అందజేస్తున్న అశ్విత్

కాగజ్‌నగర్ రూరల్: పేదరికంలో పుట్టినా చదువులో మేటిగా నిలుస్తున్న ఓ విద్యార్థికి ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అండగా నిలిచారు. రెండేళ్లపాటు ఫీజులు చెల్లిస్తామని భరోసానిచ్చారు. కాగజ్‌నగర్ మండలం అందవెల్లి గ్రామానికి చెందిన అశ్విత్ చిన్నతనంలో తండ్రి శ్రీనివాస్‌ను కోల్పోయాడు. అప్పటి నుంచి తల్లి తిరుపతమ్మ కూలీ పనులు చేస్తూ అశ్విత్‌ను చదివిస్తోంది. భట్‌పల్లి ప్రభుత్వ పాఠశాలలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో 9.5 జీపీఏ సాధించాడు. పాలిసెట్‌లో రాష్ట్రస్థాయిలో 267 ర్యాంకు సాధించి హైదరాబాద్‌లోని ప్రభుత్వ కళాశాలలో పాలిటెక్నిక్ చేస్తున్నాడు. ఇటీవల తిరుపతమ్మ ఆరోగ్యం దెబ్బతినడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని బుధవారం ఎమ్మెల్యే కోనప్పను కలిసి సమస్యను విన్నవించారు. తక్షణమే స్పందించి ఎమ్మెల్యే రెండేళ్లపాటు అన్నిరకాల ఫీజులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. చదువు మధ్యలో ఆగిపోకుండా అండగా నిలిచిన ఎమ్మెల్యేకు అశ్విత్ కృతజ్ఞతలు తెలిపాడు.

డీసీసీ అధ్యక్షుడిగా విశ్వప్రసాద రావు



విశ్వప్రసాద రావు

ఆసిఫాబాద్: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా జిల్లా కేంద్రానికి చెందిన కొక్కిరాల విశ్వప్రసాద రావు మూడోసారి ఎన్నికయ్యారు. గత మూడు దశాబ్దాలుగా జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన కృషి చేస్తున్నారు. విశ్వప్రసాద రావు మాట్లాడుతూ జిల్లాలో పార్టీ పూర్వవైభవానికి కృషి చేస్తానన్నారు. మూడోసారి జిల్లా సారథిగా నియమించినందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కాగా బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో విశ్వప్రసాద రావు అభిమానులు, కాంగ్రెస్ శ్రేణులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



దహెగాంలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజరు గ్రామపంచాయతీ పరిధిలోని వార్డుల్లోని ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అధికారులు పేర్కొన్నారు. బుధవారం గ్రామపంచాయతీ పరిధిలోని పలు కాలనీల్లో పర్యటించి పారిశుధ్య పనులు పరిశీలించారు. ఎంపీవో మహేందర్, ఈవో కృష్ణమూర్తి, ఉపసర్పంచ్ తోట మహేష్, వార్డు సభ్యులు ఇఫాత్‌హుస్సేన్, మోయిజ్, సంతోష్ పాల్గొన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీ కేంద్రాల్లో ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. ఎంపీపీ పెందోర్ మోతిరాం, ఎంపీడీవో సత్యనారాయణగౌడ్, ఎంపీవో సుదర్శన్, సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

దహెగాం: గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని మండల రైతుబంధు కన్వీనర్ సంతోష్ గౌడ్ అన్నారు. బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 23 వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ చౌదరి సురేశ్, సూపరింటెండెంట్ భవాని, యూడీసీ నాగేష్ పాల్గొన్నారు.

'విజయవంతం చేయండి'

ఆసిఫాబాద్‌అర్బన్: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కోసం గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, రాజశేఖర్‌లు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

భూముల క్రమబద్ధీకరణ చేసుకోవాలి



యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దార్

కాగజ్‌నగర్‌రూరల్: భూములను క్రమబద్ధీకరణ చేసుకోవాలని, చేసుకోని పక్షంలో ఆయా భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తహసీల్దార్ మునావర్ షరీఫ్ అన్నారు. బుధవారం మండలంలోని పాత సారసాల గ్రామానికి చెందిన గుబిడె సురేశ్, రవి, వగాడె సకారాం, విఠల్‌ల ఇళ్ల ముందున్న దడులను జేసీబీ సాయంతో తొలగించారు. కోసిని గ్రామంలో ఇద్దరు, సారసాల గ్రామంలో నలుగురు భూముల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుని ఫీజు చెల్లించలేదు. వీరికి రెవెన్యూ అధికారులు పలుసార్లు నోటీసులు జారీ చేశారు. అయినా స్పందించకపోవడంతో బుధవారం దడులు తొలగించారు. త్వరలోనే క్రమబద్ధీకరణ ఫీజు చెల్లిస్తామని ఇళ్ల యజమానులు అధికారులకు తెలిపారు. ఆర్ఐ ఖలీల్ పాల్గొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ సుమిత్

కాగజ్‌నగర్‌టౌన్: రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుందని, ప్రజలు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కాగజ్‌నగర్‌కు చెందిన న్యూట్రీషన్‌ప్లస్ డాక్టర్ సుమిత్ అన్నారు. బుధవారం స్థానిక రాజీవ్ చౌక్‌లో పట్టణ ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎండలు మండుతున్నందున మార్కెట్‌కు వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామన్నారు.